క్లుప్తంగా

నేడు తిరుపతిలో విద్యుత్‌కు అంతరాయం

తిరుపతి రూరల్: తిరుపతి నగరంలోని బాలాజీ కాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాల్లో సరఫరా నిలిపేస్తున్నట్టు ఎస్పీడీసీఎల్ తిరుపతి డివిజన్ ఈఈ వాసుదేవరెడ్డి తెలిపారు. బాలాజీకాలనీ, ప్రకాశంరోడ్డు, ఇందిరానగర్, కుమ్మరతోపు, ఎల్ఐసీ రోడ్డు, నెహ్రూనగర్, రిజర్వాయర్‌కాలనీ, పీపీ చావిడి, నరసింహతీర్థం రోడ్డు, చింతకాయలవీధి, బొమ్మగుంట, టౌన్ క్లబ్ రోడ్డు, కేవీ లేఅవుట్, కోర్టు కాంప్లెక్స్, పూల వీధి, చిన్నబజారువీధి, పట్నూలు వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న సర్పంచ్ రామచంద్రారెడ్డి, ఆలయ చైర్మన్ శ్రీధర్ రెడ్డి తదితరులు

తిరుచానూరు(చంద్రగిరి): వినాయక చవితి ఉత్సవాలను వాడవాడల ఘనంగా జరుపుకుంటున్నారు. తిరుచానూరు ఆర్‌కే మండపం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడికి సర్పంచ్ రామచంద్రారెడ్డి, పరాశరేశ్వర స్వామి ఆలయ చైర్మన్ శ్రీధర్ రెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు నరేష్ రెడ్డి, యోగానందరెడ్డి, వార్డు సభ్యులు మునీంద్ర రాయల్, చంద్రశేఖర్ ఆజాద్, ఆర్‌ఆర్‌యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం

చంద్రగిరి: పరిసరాలతో పాటు పట్టణాన్ని శుభ్రంగా ఉంచుకుందామని చంద్రగిరి సర్పంచ్ ముదికుప్పం రూప పిలుపునిచ్చారు. ఇండియన్ స్వచ్ఛతా లీగ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చంద్రగిరిలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం చేపట్టారు. పంచాయతీ కార్యాలయం నుంచి నేషనల్ హైవే వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఈవో మహేశ్వరయ్యతో కలిసి పరిసరాల శుభ్రతపై సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

మానవాళి మనుగడకు నావల్ డ్రగ్ డెలివరీ సిస్టం ఉత్తమం

రామచంద్రాపురం: విషపూరితాల నుంచి మానవాళిని రక్షించేందుకు నావల్ డ్రగ్ డెలివరీ సిస్టం ఉత్తమమైనదని పద్మావతి మహిళా వర్సిటీ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ ప్రొఫెసర్ నాగరాజు తెలిపారు. వెంకట్రామాపురం సమీపంలో ఉన్న సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం అనంతపురం జేఎన్‌టీయూ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో రీసెంట్ అడ్వాన్సెస్, ట్రెండ్స్ అండ్ చాలెంజెస్ ఇన్ ఫార్మాస్యూటికల్ నానో టెక్నాలజీ రీసెర్చ్ టు రెవెన్యూ అనే అంశంపై ఇస్తున్న శిక్షణలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కొత్త మందులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్వీయూ వైరాలజీ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ నరసింహ మాట్లాడుతూ నానో టెక్నాలజీ ద్వారా క్యాన్సర్, హెచ్ఐవీ చికిత్సలో పెనుమార్పులు వస్తాయన్నారు. ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబు, కరస్పాండెంట్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతి

చంద్రగిరి: ఆటో బోల్తాపడి డ్రైవరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పులిచెర్ల మండలం రామిరెడ్డిపల్లి పంచాయతీ వెలగబైలుకు చెందిన అశోక్ కుమార్(41) తిరుపతికి ఆటోలో వస్తున్నాడు. దొనకోటి గంగమ్మ ఆలయం సమీపంలో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. అశోక్ కుమార్ తలకు తీవ్ర గాయం కాగా, మరో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. వారిని 108 సిబ్బంది తిరుపతి రుయాకు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అశోక్‌కుమార్ మృతి చెందినట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు. మిగిలిన వారు చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాహన సేవలను తిలకించేందుకు తరలివచ్చిన అశేష భక్త జనం



వైభవోత్సవం

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. స్వామిని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శుక్రవారం వివిధ వాహన సేవల్లో పలు ప్రాంతాల నుంచి వచ్చిన కళాబృందాలు చక్కటి ప్రదర్శనలు ఇచ్చాయి. కళాకారులను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి, జేఈవో సదా భార్గవి కలిసి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమాలను టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ప్రోగ్రామింగ్ ఆఫీసర్ రాజగోపాల రావు, హెచ్‌డీపీపీ కార్యదర్శి శ్రీనివాసులు, దాస సాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు పర్యవేక్షిస్తున్నారు. – తిరుమల



భక్తులకు ఆహారపు పొట్లాలు అందజేస్తున్న శ్రీవారి సేవకులు





గ్యాలరీల్లో ఉన్న భక్తులు వాహన సేవలను దర్శించుకున్న తర్వాత వేరే మార్గంలో వెలుపలకు పంపుతున్న అధికారులు, పర్యవేక్షిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



భక్తులకు కాఫీ పంపిణీ చేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన



భక్తులతో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన, ఈవో



యువతికి వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

బ్రహ్మోత్సవాల్లో నేటి వాహనాలు

తిరుమల: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. స్వామి వారు వివిధ వాహనాల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం హనుమ, గజ వాహనాలపై ఊరేగనున్నారు. అలాగే స్వర్ణ రథంపై కొలువుదీరి ఆలయ నాలుగు మాఢ వీధుల్లో విహరించనున్నారు.

హనుమ వాహనం : త్రేతాయుగంలో తనకు సేవ చేసిన భక్త శిఖామణి హనుంతుడిని వాహనంగా చేసుకుని స్వామివారు తిరువీధుల్లో ఊరేగింపుగా వెళతారు. హనుమంతుని భక్తి తత్పరతను తెలియజేస్తూ.. రాముడు, కృష్ణుడు, వేంకటేశ్వరుడు అన్నీ తానేనని ఈ సేవ ద్వారా భక్త కోటికి తెలియజేస్తారు. ఆరవరోజు శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఈ వాహన సేవ నిర్వహిస్తారు.

గజవాహనం : భాగవతంలో గజేంద్ర మోక్షం ఘట్టంలో ఏనుగును కాపాడిన విధంగానే తనను శరణు కోరే వారిని కాపాడతానని చాటి చెప్పడానికి శ్రీనివాసుడు ఈ వాహనంపై ఊరేగుతారు. గజ వాహనారూఢుడైన కలియుగ వైకుంఠ వాసుడిని దర్శిస్తే ఏనుగంత సమస్య కూడా తొలగిపోతుందని భక్తుల విశ్వాసం. బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజు శనివారం రాత్రి 7 గంటల నుంచి 9 వరకు ఈ సేవ జరుగుతుంది.

స్వర్ణరథం : సువర్ణ ప్రభలతో దర్శనమిచ్చే వేంకటేశ్వర స్వామివారు స్వర్ణకాంతులీనే స్వర్ణరథం అంగరంగవైభవంగా నిర్వహిస్తారు. ఆరోరోజు సాయం సంధ్యా సమయంలో రథరంగ ఢోలోత్సవం సేవ పేరుతో ఈ స్వర్ణరథం ఊరేగింపు నిర్వహిస్తారు. స్వర్ణ రథం ప్రభలకంటే బంగారు స్వామి ప్రభలే అత్యద్భుతంగా ఉంటాయి. ఈ సేవలో స్వామిని దర్శించి భక్తకోటి తరించడం సంప్రదాయంగా వస్తోంది.

ఆకట్టుకున్న సంగీత, నృత్య ప్రదర్శనలు



మహతి కళాక్షేత్రంలో నృత్యాలు ప్రదర్శిస్తున్న కళాకారులు

తిరుపతి కల్చరల్: ఆధ్యాత్మిక తిరుపతి నగంలోని వివిధ కళా వేదికలపై శుక్రవారం రాత్రి కళాకారులు సంగీత, నృత్యప్రదర్శనలతో గరుడ వాహనారూఢుడైన శ్రీవారికి సాంస్కృతికాంజలి సమర్పించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో మహతి, అన్నమాచార్య కళా మందిరం, రామచంద్ర పుష్కరిణి వేదికలపై సంగీత, నృత్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహతిలో చిదంబరం సాయినాట్యపల్లి కళాబృందం నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అన్నమయ్య సంకీర్తనలకు కళాకారులు లయబద్ధంగా నృత్యం చేసి సభికులను ఆకట్టుకున్నారు. అదేవిధంగా అన్నమాచార్య కళామందిరంలో కళాకారుడు కె.చంద్రశేఖర్ హరికథా గానం శ్రవణానందకరంగా సాగింది. ఇదే రోజు శ్రీరామచంద్ర పుష్కరిణి వేదికపై కళాకారులు జి.వెంకటవాయునందన్, జి.శ్రీనివాస వాయునందన్ సంగీత కచేరి భక్తులను అలరించింది.

వాహన బేరర్లకు పంచెల పంపిణీ



వాహన బేరర్లు, మేళం సిబ్బందికి పంచెలు అందజేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి

చంద్రగిరి: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారి ఆలయంలో విధులు నిర్వహించే వాహన బేరర్లు, మేళం సిబ్బందికి శుక్రవారం తమిళనాడుకు చెందిన తంగదొరై రూ.2 లక్షలు 120 పంచెలు బహుమానంగా అందించారు. ఉదయం పల్లకీ ఉత్సవం అనంతరం వైభవోత్సవ మండపంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ శ్రీహరి, పారుపత్తేదార్ తులసీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి, రఘునాథరెడ్డి

రామచంద్రాపురం: పాడి పశువుల సంరక్షణే ప్రభుత్వ లక్ష్యమని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం రాయలచెరువుపేటలో తిరుపతి జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రఘునాథరెడ్డి, పశుసంవర్ధక శాఖ ఏడీ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పశు వైద్యులు మదన్, హేమకుమార్, ప్రతిభ అత్యాధునిక అల్ట్రాసౌండ్ పరికరం ద్వారా పశువుల్లో గర్భస్థ వ్యాధులను గుర్తించి వైద్యం అందించారు.

ఏసీబీ కోర్టు, హైకోర్టు ఉత్తర్వులు సమర్థనీయం

తిరుపతి లీగల్: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టి వేస్తూ ఏపీ హైకోర్టు కొట్టివేయడం సమర్థనీయమని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు టి.మునిబాలసుబ్రమణ్యం(దొరబాబు) తెలిపారు. ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తన మీద నమోదైన ఎఫ్ఐఆర్‌ని కొట్టివేయాలని, విజయవాడ ఏసీబీ కోర్టు తనకు విధించిన రిమాండ్‌ను రద్దు చేయాలని కోరుతూ చంద్రబాబు హైకోర్టులో క్వాష్ పిటీషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. అలాగే చంద్రబాబును తమ కస్టడీకి ఇవ్వాలని సీఐడీ ఏసీబీ కోర్టులో పిటిషన్ వేసింది. ఈ క్రమంలో ఏసీబీ కోర్టు చంద్రబాబును రెండు రోజులు కస్టడీకి ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీనిపై కొందరు తెలుగుదేశం పార్టీ నేతలు న్యాయస్థానాలను విమర్శించడం విడ్డూరమని తెలిపారు.